క్లుప్తంగా

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా శేఖర్



తిరుపతి కల్చరల్: శ్రీ బాలాజీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షుడిగా మల్లకుప్పం శేఖర్ ఎంపికయ్యారు. ఈమేరకు ఆదివారం కొర్లగుంటలోని యూనియన్ కార్యాలయంలో యూనియన్ పూర్వ అధ్యక్షుడు కె.మునికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన అధ్యక్షున్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగిలిన నగర కమిటీ ప్రతినిధులను జూన్ 2వ తేదీ ఆదివారం జరిగే సమావేశంలో ఎన్నుకోనున్నట్లు పూర్వ అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి తెలిపారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక గాయత్రి జపం



గాయత్రి జపం చేపడుతున్న జపతులు

తిరుపతి కల్చరల్: నరసింహ తీర్థం రోడ్డులో ఉన్న శివాలయంలో ఆదివారం లోకకల్యాణార్థం సామూహిక గాయత్రి జప పారాయణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మశ్రీ కల్వకొలను చిత్తరంజన్ దాస్ మెమోరియల్ ట్రస్ట్ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో తిరుపతి కోఆర్డినేటర్ ఖండవల్లి రాధాకృష్ణ పర్యవేక్షణలో సుమారు 20 మంది జపతులు సామూహిక సంధ్యావందన సహిత గాయత్రి జపం చేశారు. అదేవిధంగా కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి 60వ జన్మదినం సందర్భంగా కపిలతీర్థం సమీపంలోనున్న వృద్ధాశ్రమంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి జోన్ పరిధిలోని జపతులంతా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి కల్చరల్: సేవా భారతి, కేశవ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో రైల్వే కాలనీలోని శ్రీసరస్వతీ శిశుమందిరంలో ఆదివారం నిర్వహించిన సిద్ధ ఆయుర్వేద యోగ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి ప్రజల సౌకర్యార్థం గత నాలుగు నెలలుగా ప్రతి నెల చివరి ఆదివారం ప్రజలకు ఉచిత వైద్యశిబిరం చేపడుతున్నారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రముఖ ఎముకల శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లోపతి వైద్యం, ఆయుర్వేద వైద్యం రెండు మానవుడికి అవసరాన్ని బట్టి సమతుల్యంగా పోతే అద్భుత ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకుని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని తెలిపారు. అనంతరం విచ్చేసిన వారికి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సహసేవ ప్రముఖ గంధపుడి మునిరత్నం, జిల్లా సహాయ బౌద్ధిక ప్రముఖ టి.ధనుంజయ, కొండారెడ్డి, డాక్టర్ సుందర్‌మూర్తి, శరవణ, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, ఎం.రాజేంద్రన్, పద్మనాభం, కీర్తి వెంకయ్య, నిర్వాహకుడు జి.మునిరత్నం పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



నాయుడుపేట టౌన్ : శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి కల్యాణోత్సవం ఆదివారం అర్ధరాత్రి వరకు కనుల పండువగా నిర్వహించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు సింహ వాహనంపై, కరిమాణిక్య స్వామి గజ వాహనంపై అధిష్టించి గ్రామంలో ఊరేగించారు. అనంతరం కల్యాణ మండపానికి తీసుకువచ్చి వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో టీటీడీ ఆగమ పండితులతో పాటు టీటీడీ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి, ఆలయ మాజీ ట్రస్టీ కామిరెడ్డి రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి మోహన్‌రెడ్డి, నరసారెడ్డి, పసల గంగాప్రసాద్, సురేష్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మెరుగ్గా ఆరోగ్యశ్రీ అమలు

- స్విమ్స్, రుయా ఆస్పత్రుల తనిఖీ
- ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈఓ డాక్టర్ లక్ష్మీశ



రోగితో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీశ

తిరుపతి తుడా : ఆరోగ్యశ్రీ వైద్య సేవలను మరింత మెరుగ్గా అమలు చేస్తున్నామని ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈఓ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ఆదివారం ఆయన తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ వార్డు, ఎమర్జెన్సీ ఐసీయూ వార్డుల్లో చికిత్స పొందుతున్న ఆరోగ్యశ్రీ రోగులను పరామర్శించారు. ఆరోగ్యశ్రీ సేవలు ఎలా అందుతున్నాయని రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రేడియేషన్ థెరపీ, ఆపరేషన్ థియేటర్‌ను సందర్శించి పని తీరు తెలుసుకున్నారు. జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా మేనేజర్ శివకుమార్‌తో ఆయన కలిసి స్విమ్స్‌తో పాటు రుయాలోని పలు వార్డులను తనిఖీ చేశారు. అలాగే ఆరోగ్యశ్రీ టీం లీడర్స్ పురం శ్రీనివాసులు, సమాధి శ్రీనివాసులు, ఆరోగ్య మిత్రా పాల్గొన్నారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రామ్, డాక్టర్ జయచంద్ర రెడ్డి, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డిప్యూటీ కలెక్టర్ భాస్కర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ హరికృష్ణారెడ్డికి నివాళి



హరికృష్ణారెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : ఈ నెల 18వ తేదీన ఆకస్మికంగా మృతి చెందిన మాజీ ఎంపీటీసీ హరికృష్ణారెడ్డికి చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. ఆదివారం హరికృష్ణారెడ్డి కర్మక్రియల సందర్భంగా వారు సామిరెడ్డి పల్లికి చేరుకుని కార్యక్రమంలో పాల్గొన్నారు. సీనియర్ నాయకుడు హరికృష్ణారెడ్డి మృతి చెందడం పార్టీకి తీరని లోటని, ఆయన సేవలు ఎనలేనివని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే హరికృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలన్నారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వీరితో పాటు మండలంలోని పలువురు నాయకులు హరికృష్ణారెడ్డికి నివాళులు అర్పించారు.

రమణీయం.. కళా సాంస్కృతికం



కళాకారులు, గాయకులను సత్కరించిన నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: స్నేహ హోమ్ ఫర్ ఎల్డర్ ప్రారంభోత్సవం సందర్భంగా జీవకోనలోని రైస్ స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయంలో ఆదివారం మన సంస్కృతి కళా సంస్థ కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక అలరింపజేసింది. సుమారు 15 మంది గాయనీ గాయకులు అద్భుతమైన జానపద గీతాలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా తమ పాట ఆటలతో అలరింపజేసిన గాయనీ గాయకులను, కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత జడ్జి ఆనందరావు, రైస్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు రామకృష్ణ, స్త్రీశక్తి సంఘటన సంస్థ కార్యదర్శి సుశీల, మన సంస్కృతి కళా సంస్థ ప్రధాన కార్యదర్శి కె.రెడ్డెప్ప, కళాకారులు, ఉపాధ్యాయులు గురుస్వామి, నీరజ, నాగమణి, కృష్ణకుమారి, లక్ష్మి, వెంకటరమణ, డప్పు చలపతి, ఆదివాసీ విద్యాలయ బాలికల వసతి గృహం డైరెక్టర్ సాకం కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.5లక్షల విరాళం



విరాళ చెక్‌ను చైర్మన్, ఈఓకు అందజేస్తున్న బాలాజీ దంపతులు

చౌడేపల్లి: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఉచిత అన్నదానం నిర్వహణకు తిరుపతికి చెందిన బాలాజీ దంపతులు రూ.5 లక్షల విరాళమిచ్చారు. ఆదివారం చెక్‌ను ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళికి అందజేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి శాలువతో సత్కరించారు. వేదపండితులు ఆశీర్వవచనం పలికారు. కార్యక్రమంలో బోయకొండ ఆలయ కమిటీ డైరెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

సుమధురం.. సంకీర్తనల గానం



సంకీర్తనలు గానం చేస్తున్న అన్నమయ్య వంశానికి చెందిన లలిత, హయగ్రీవ నారాయణచార్యులు



సంకీర్తనలను గానం చేస్తున్న ప్రముఖ యువ సంగీతకారులు శ్రీనివాస శర్మ బృందం

తిరుపతి కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసులు హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస శర్మ బృందం, లలిత, హయగ్రీవ నారాయణచార్యుల బృందం ఆలపించిన అన్నమయ్య సంకీర్తనల గానామృతం సుమధురంగా సాగింది. అన్నమయ్య 616వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం భక్తి సంకీర్తనల గాత్ర కచేరీ నిర్వహించారు. అన్నమాచార్యుల వంశానికి చెందిన 13వ తరం వారసులు ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ లలిత, హయగ్రీవ ఆలపించిన కీర్తనలతో భక్తజనం తన్మయత్వం చెందారు. ఇందులో భాగంగా వారు ఇందరికీ అభయంబు.., శోభనమే శోభనమే.., పిలువరే కృష్ణుని.., వేదం బెవ్వని వేదుకుందామా.. వంటి కీర్తనలను రమణీయంగా గానం చేసి సభికులను మైమరిపించారు. అనంతరం ప్రముఖ యువ సంగీతకారులు శ్రీనివాస శర్మ బందం పలు విచారమేల.., మత్స్య కూర్మ వరాహ.., రాజీవ నేత్రాయ.., ఎంత మాత్రమమున.., తానే స్వయంగా స్వరపరిచన ఆలపించిన కొనుట వెగ్గణము వంటి అన్నమయ్య సంకీర్తనలు గానం చేసి సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా కళాకారులను అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల ఘనంగా స్వామి ప్రసాదాలు అందజేసి సత్కరించి అభినందించారు.

అలరించిన దుర్యోధన వధ



ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీ సమేత శ్రీ ధర్మరాజుల స్వామి

- భారీగా తరలి వచ్చిన ప్రేక్షకులు
- విశేష అలంకరణలో అమ్మవారి దర్శనం



యుద్ధభూమిలో దుర్యోధనుడు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం యడమవారిపల్లెలో జరుగుతున్న 73వ మహా భారత ఉత్సవాల్లో చివరి ఘట్టం దుర్యోధన వధ అలరించింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు భారీగా జనం వచ్చారు. కౌరవులు అంతా యుద్ధంలో చనిపోయిన తరువాత దుర్యోధనుడు నీటి మడుగులో చేరుకుంటాడు. భీముడు నీటి మడుగు వద్దకు వెళ్లి దుర్యోధనున్ని మడుగులో నుంచి బయటికి రప్పించే సన్నివేశం ప్రేక్షకులను అలరింపజేసింది. పెద్దపెద్ద బండరాళ్లతో జరిగే యుద్ధ సన్నివేశం చూసేందుకు ప్రేక్షకులు ఎగబడ్డారు. యుద్ధ సన్నివేశంలో దుర్యోధనుడు, భీముడి వేషధారుల నటన అందరినీ ఆకట్టుకుంది. యుద్ధ సన్నివేశంలో దుర్యోధనుడు మరణించిన వెంటనే ప్రేక్షకులు పోటీలు పడి దుర్యోధనున్ని తీర్చిన మట్టి (బంక మట్టి) జనం ఎగబడ్డారు. దుర్యోధనుడు మట్టి ఇంట్లో ఉంటే ఆ ఇంటిలో కలిమి, బలిమి, ధనధాన్యాలు తులతూగుతుంటాయనే నమ్మకంతో ప్రజలు ఆ మట్టిని తీసుకెళ్లి ధాన్యంలో పెట్టుకోవడం జరుగుతుంది. ఈ సందర్భంగా శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ ప్రజలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రచయిత సురేంద్రకు సత్కారం



అన్నమయ్య పురస్కారంతో రచయిత రొడ్డ సురేంద్రను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన ప్రముఖ రచయిత రొడ్డ సురేంద్రకు అన్నమయ్య పురస్కారం లభించింది. రచనా, విద్యా, కళారంగాల్లో విశేష కృషి చేసిన వారికి బైరెడ్డిపల్లె సంప్రదాయ కళల పరిరక్షణ సమితి, తిరుపతి ఏఎస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో రచనా రంగంలో విశేష సేవలు అందించి కళామతల్లికి సేవలందిస్తున్న రచయిత రొడ్డ సురేంద్రను అన్నమయ్య పురస్కారంతో ఘనంగా సత్కరించి అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ఘటం ప్రారంభం



ఘటం ఊరేగింపులో నిర్వాహకులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతరలో భాగంగా ఆదివారం ఘటాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా శెట్టిపల్లివారి వీధిలో ఉన్న పోలేరమ్మ అలంకార మండపం వద్ద గ్రామపెద్దలతో పాటు విన్నమాల గ్రామానికి చెందిన పెద్ద కాపు అరవ భూమి శ్రీనివాసులురెడ్డి, ధీరజ్ రెడ్డి, స్థానిక దేవదాయశాఖ అధికారులు కలిసి పోలేరమ్మ ఘటానికి పూజలు చేశారు. అనంతరం పట్టణంలో ప్రతి ఇంటికీ తీసుకువెళ్లారు.

నారాయణతే నమో..నమో



కూచిపూడి నాట్యంతో అలరిస్తున్న కళాకారులు

- శిల్పారామంలో ఆకట్టుకున్న కూచిపూడి

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నాట్యం ప్రేక్షకులను అలరించింది. హైదరాబాద్‌కు చెందిన గాయత్రి స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్, నాట్య గురువు జ్యోతి శేఖర్ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి నాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా గణేష పంచరత్న, నారాయణతే, వినరో భాగ్యం, చక్కని తల్లికి, దశావతో శబ్దం, మండూక శబ్దం, జయ జయ దుర్గే, కృష్ణ రాసలీల వంటి పాటలకు కళాకారులు వైష్ణవి, లాస్య, మీనాక్షి, అక్షర, సహస్ర, ఈష, సాక్షర శ్రీ, సాయి శ్రీప్రియ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాటకు తగిన అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నృత్యాలను ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో వారిని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 6.678 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.678 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంజాయ్ సండే..

వేసవి సెలవులు కావడంతో నగర వాసులు పిల్లలతో పార్కుల్లో సందడి చేస్తున్నారు. పిల్లలంతా పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆడుకుంటున్నారు. అటు ఎన్నికల హోరు ముగియడం, ఇటు గంగమ్మ జాతర పరిసమాప్తం కావడంతో వేసవి సెలవుల్లో కాస్త ఊరట చెందేందుకు అవకాశం లభిస్తోంది. దీంతో ఆదివారం ఉదయం, సాయంత్రం వేళ పార్కుల్లో చేరి కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడుపుతున్నారు. ఇందులో భాగంగా తిరుపతి ఆదివారం మున్సిపల్ ప్రకాశం పార్క్‌లో పిల్లలు, పెద్దలతో పార్క్ నిండుదనం కనిపించింది. ఆటలతో సందడి చేసే దృశ్యాలను సాక్షి కెమెరా బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి







